# ఓంకారము–3

ఏ దేశపు పతాకము ఆ దేశమునకు చిహ్నము గదా! పతాకవందనమనగా, ఆ దేశమునకు వందనముగాన, పతాకములను ఆ దేశప్రధాన లక్షణములు తెలియజేయునట్లును, ఆ దేశప్రజల ఆదర్శములను తెలియుటకు వీలుగాను జేయుచున్నారు. భారతీయ పతాకము మీదనున్న ధర్మచక్రము మన న్యాయ, ధర్మభావములకు సూచన. అమెరికా దేశపు జెండా మీద నున్న నక్షత్రములు, అందలి వేరు వేరు రాష్ట్రములకు గుర్తులు. మనకు తెలిసిన పెద్ద వస్తువుగాని, చిన్న వస్తువుగాని, విశాలమైన భావముగాని, స్వల్పభావముగాని, తిరిగి జ్ఞప్తికి రావలెననినచో, ఏదియో ఒక చిహ్నము నుపయోగించుట మానవసహజము. ప్రతిమాటయు ఒక వస్తువునకుగాని, భావమునకుగాని, చిహ్నమే గదా! ఆ శబ్ద ములోని ప్రతి అక్షరము మననోటి నుండి వెలివడు ఒక ప్రత్యేకమయిన "ధ్వని" కి గుర్తు గదా! గుర్తు నేర్పరచుకొనుట మానవప్రవర్తనలో నొక భాగము. కనుకనే విశాలమైన దేశము కానిమ్ము, గొప్పదైన భావము కానిమ్ము, దానికొక చిహ్నమేర్పరచి, ఆ చిహ్నమును పూజించి, గౌరవించి, ఆ దేశమును గౌరవించినట్లు, ఆ భావమును స్వీకరించినట్లు భావించుట, మానవులందరును చేయు పని.

ఆ దేశముగాని, ఆ భావముగాని ఒక్క భూమి మీదనే గాక, నక్షత్రమండలముల చివరి అంచులనుండి, మన గుండెలోతుల వరకు వ్యాపించియున్నపుడు దాని పతాకము, చిహ్నము ఎట్లుండవలెను? అందలి అన్ని ప్రాణుల, అన్ని వస్తువుల లక్షణములు, గుణములను సూచించవలెను గదా! ఈ అనంతమైన విశ్వమున, అందలి నక్షత్రములకు, గ్రహ ములకు, ప్రాణులకు–ఒక్క మాటలో అన్నిటికిని సామాన్య లక్షణము లేమిటి? మొట్టమొదటిది పుట్టుట ఆరంభము. దీని నెట్లు తెలియజప్పుట? దేనిని చెప్పదలచినను నోరు గదా, ప్రధానమైన ఆధారము. నోరు తెరచి, చెప్పుటకు యత్న మారంభింపగనే వెలికి వచ్చు అక్షరము "అ". శిశువు భూమిమీద పడగనే ఏమి చేయుచున్నది? నోరు తెరచి అరచు (రోదించు) చున్నది. నేను క్రొత్త ప్రాణిని, వచ్చినాను; గుర్తుంచుకొనవలసినది–అనుచున్నది. ఆరంభమునకు "అ" చిహ్నము.

ఈ పుట్టినవన్నియు అంతమగుచున్నవి. తెరచిన నోరు మూతపడుటకు; పెదిమలు కలసినవేళ పుట్టు ధ్వని "మ్" – "మ" కాదు. "మ" అనుటకు మరల నోరు తెరచుచున్నాము. "మ్" అంతమునకు గుర్తు.

పుట్టినవన్నియు వెంటనే అంతమగుట లేదు. మధ్యస్థితి ఉన్నది. తెరచిన నోరు మూతబడుటకు మధ్యస్థితి యం దు మన పెదిమలు గుండ్రని యాకారము పొందినపుడు "ఉ" కారమును పలుకుచున్నాము. "ఉ" మధ్యకాలమును తెలు పును. అ, ఉ, మ్ – అనిన మూడును, ప్రాణముండనిమ్ము, లేక పోనిమ్ము, ఈ విశ్వమందలి అన్నిటిని గూర్చి చెప్పుచున్నవి.

మనపైన ఈ మూడు స్థితులు వేరువేరుగా లేవు. ఒకదాని వెంట మరియొకటిగా కలసి ఉన్నవి. కనుక ఈ మూటిని కలుపవలెను. కలిపి ఒకటియే అక్షరము సేయవలెను. అక్షరము (syllable) నందు ఒక అచ్చు (vowel) గాని అచ్చుతో కలసిన హల్లు (consonant) గాని ఉండును. మనము ఏదియైన అక్షరముచ్చరింపదలచిన వేళ, మెదడు నుండి ఆజ్ఞ నాభివద్దకు పోవును. నాభివద్దనున్న కండరములు అచ్చటనున్న వాయుమండలమును కదుపును. బొడ్డు దగ్గర కదలిన కదలిక కంఠము వరకు వచ్చి, అచ్చట కదలిన వాయువు కంఠనాళముల యందు మ్రోగును. ఆ మ్రోగిన ధ్వని, తెరచిన నోటి వెంట వెలికి వచ్చును. నాభివద్ద కదలిక నుండి శబ్దము వెలికి వచ్చువరకు పట్టుకాలమునకు మాత్ర అని పేరు. ఇంకొక అచ్చును ఉచ్చరింపవలెననినచో, అది నాభి వద్ద మరియొక కదలిక. ప్రతి అచ్చునకు దాని కొరకైన కదలిక, మాత్రకాలము కావలెను కాని, హల్లులకు అట్లుకాదు. అచ్చు కంఠనాళములనుండి బయటకు వచ్చు వేళ, నాలుకను నోటిలో క్రింద మీదుల తాకించిగాని, పెదిమలను కలిపిగాని, కావలసిన హల్లులను పుట్టించవచ్చును. కంఠనాళమునుండి, అచ్చు పెదిమలను దాటులోపల మనము ఎన్ని పర్యాయములు నాలుక, పెదిమలను మలచి, క్రింది మీదుల స్పర్శను కలిపించిన[1], అన్ని హల్లులను పలుకవచ్చును.

అ, ఉ, మ్ – మూడింటిలో హల్లు అయిన మ్ అను అక్షరమునందు కలుపుటలో ఇబ్బంది లేదు. ఒకే మాత్ర కాలమునందు ఇముడును. కానిచో, మాత్రను మించి, ఒక్క పిసరు సాగునేమో[2] ! కాని ప్రత్యేకముగా దీనికొరకు వేరొక కదలికవలన, మరియొక వాయుగుళిక కంఠనాళమును చేరవలసిన అవసరము లేదు. కలుపవలసినవి – అ, ఉ – లు. ఒక మాత్రకాలములోన రెండచ్చులను పలుకగల శక్తి మన వాగ్యంత్రమునకు లేదు. కాని ప్రయత్నము చేసినచో పుట్టు అచ్చు ఓ. ఇది ఎవరికి వారు ప్రయత్నము చేసి చూడవచ్చును. ఈ అచ్చుల కలయికనే వ్యాకరణమునందు సంధి అని పిలుతురు. వేదము తన మన్త్రముల చేత, సంకల్పము, వాయు సంచలనము, అక్షరోత్పత్తి, వాటి కలయిక, అందరి మానవులయందు ఎట్లు జరుగునో చూసినది. సృష్టిలో ఇంతవరకు పుట్టిన, ఇకముందు పుట్టబోవు అన్ని భాషల యొక్క వ్యాకరణములు ఏయేదారుల వెంబడి పోవునో, పోవుటకు వీలున్నదో తెలియజెప్పినది. అన్ని భాషల వ్యాకరణముల మూల వ్యాకరణము, వేదవ్యాకరణము. వ్యాకరణమనగా, వాక్కును వ్యక్త పరచు పద్ధతి.

ఈ కలయిక వలన ఉద్భవించిన ఓంకారము విశ్వమునకు చిహ్నము. ఓమితీదం సర్వం ఓమిత్యే దనుకృతిః అని తైత్తిరీయోపనిషత్తు (షష్ఠానువాకము) ఓంకారమే సర్వము. ఓంకారమునే అందరు అనుకరింతురు. అని అర్థము. అన్ని ప్రాణులును, ఆదిమధ్యాంత స్థితులచేత ఓంకారమును అనుసరించుచున్నారు. అందువలన ఓంకారము సర్వము నకు చిహ్నమని తాత్పర్యము.

నోరు తెరచుటతో అకారము, మూయుటతో మకారమును ఉచ్చరించుచున్నాము గాన, తక్కిన అక్షరముల నుచ్చరించుటలు ఈ రెండు క్రియల మధ్యనున్న గదా! ఒక్క మన భాష యందలి అక్షరములే కాదు. సకలభాషల అక్షరములును గూడ అవియే కదా! మానవులుచ్చరింప గలిగిన అక్షరములు ఓంకారగర్భమునందున్నవి. అక్షరముల కూడిక శబ్దము. శబ్దముల కూడిక వాక్కు. బ్రహ్మాండమునందు నిండి నిబిడీకృతమైన జ్ఞానమే బ్రహ్మము. ఆ జ్ఞాన

ప్రకటనమే వాక్కు. వాక్కు శబ్దబ్రహ్మము. ఓంకారము శబ్దబ్రహ్మమునకు చిహ్నము. లోనున్న జ్ఞానబ్రహ్మమే, శబ్ద బ్రహ్మభావమునకు ప్రతీక. ఏతద్ధ్యేవాక్షరం బ్రహ్మ– ఓం అను అక్షరమే బ్రహ్మము (కఠోపనిషత్తు, ద్వితీయ వల్లి, 16).

మానవునకు జీవితమునందు మూడు స్థితులున్నవి – మెలకువ, స్వప్నము, నిద్ర. మెలకువగా నున్న వేళ అన్ని పనులను చేయుచున్నాము. భావనలో విశ్వమంతయు పర్యటించుచున్నాము. మనప్రాణశక్తిని ఎక్కువ భాగము విని యోగించునది ఈ సమయమున. రెండవది అయిన స్వప్నమునందు మనస్సు వలన సుఖదుఃఖముల ననుభవించుట ఉన్నది గాని, స్థూల శరీరము శ్రమపడుట లేదు. స్వప్నావస్థలోని కాలము చాల తక్కువ. ఆ స్థితియందు మనము విని యోగించు ప్రాణశక్తి మెలకువ సమయమునందుకంటె తక్కువ. నిద్రాసమయమునందు ఇంకను తక్కువ. మనము పొందునట్టి ఈ మూడు స్థితులును కలసి ఉన్నవి. వేరుగా లేవు. అకారమును ఉచ్చరించుటకు ప్రాణ శక్తిని ఎక్కువగ, ప్రగల్భముగ ఉపయోగింపవలెను. ఉకారోచ్చరణమునకు తక్కువ ప్రాణ శక్తి చాలును. మ్ – ఉచ్చరించుటకు చాల తక్కువ. ఎవరికి వారు నిద్రపోయి లేచి, ఏమనుకొనుచున్నారు? నేను నిద్రలేచితిని – అని. ఆ నేను – నకు మెలకువగ నున్న వేళ వైశ్వానరమనియు, స్వప్నమందు తైజసమనియు, నిద్రయందు ప్రాజ్ఞమనియు వేదమిడిన పేర్లు. ఇవి సాంకేతిక నామములు (technical terms) ఎక్కువ ప్రాణశక్తినుపయోగించి అకారముచ్చరించునపుడు లోని జీవాత్మ వైశ్వానరస్థితియందున్నది. ఉకారోచ్చరణము తైజసమందు. మ్ – ను ప్రాజ్ఞస్థితియందుచ్చరించును[3]. ఓం కారము భిన్న స్థితులలో నుండు జీవాత్మకు కూడ చిహ్నము.

సృష్టియందున్న బ్రహ్మమనిన సకల జ్ఞానమునకు ఓంకారము చిహ్నమైనచో, ఆ జ్ఞానములో భాగమైన మన జ్ఞానశరీరమునకు గూడ ఓంకారమే చిహ్నముగదా! ఓంకారోచ్చారణమున ఆది మధ్యాంతములుండుటజేసి, మన భౌతిక శరీరమునకు గూడ, ఓంకారము ప్రతీక.ఆశ్చర్యమునందు మానవులందరును ఆ, ఆహా, అని గొంతెత్తి పలుకు దురు గదా! చలికి ఉహూఉహూయని వణుకుదురు. తాను పలికిన అసత్యము బయట పడి, తగిన సమాధానమీయలేని స్థితియందు మానవుడేమి సేయును? మ్, మ్–అనుచు మాట మ్రింగును. ఈ మూడు స్వరములును మాటలలోని అక్షర ములు మాత్రమే కాదు. మనస్సునందలి ఆనందము, క్రోధము, ఈర్ష్య, సంకటస్థితి మొదలైన భావములను ప్రకటించు స్వనములు.మనస్సు సూక్ష్మదేహ ప్రధానావయవముగాన, ఓంకారము సూక్ష్మదేహమునకు, శాబ్దికమైన ప్రతిరూపము. ఓంకారమును స్మరించినచో మన మూడు దేహములును గుర్తుకు వచ్చును.

మనమోంకారము. ఆ బ్రహ్మమును ఓంకారము. ఇంక భేదమెక్కడ? వలసినప్పుడు శబ్దాకృతిని పొందగలిగిన జ్ఞానరూపమైన, మన ఓంకారము, మన హృదయాకాశమున[4] ఉన్నది. మనమైన ఓంకారము శరీర, మనఃప్రాణముల తోడ కలసి యుండుట చేత తాత్కాలికమైనది.

దానిని బ్రహ్మమయమయిన ఓంకారమువలె నిత్యము సేయవలెను. దానికి బ్రహ్మమయమయిన ఓంకారమును ధ్యానము సేయవలెను. తపస్సు చేయవలెను. అనగా ఆలోచింపవలయును. ఆలోచనలో క్రమముగా ఈ సృష్టి యందలి

అన్ని లక్షణములను ఓంకారమునందు చూచుటకలవాటు పడును. ఆ ఓంకార సముద్రమున తానొక బిందువైన ఓం కారమను దృష్టి కుదురును. అదియే బ్రహ్మభావము. బ్రహ్మభావసిద్ధి చెప్పినంత తేలికకాదు. చాల తపస్సు వలన క్రమముగా సిద్ధించు స్థితి.

ఈ పతాకమును మన దేశముల జెండాలవలె పర్వదినములందు స్తంభములకెక్కించి, వందనమయిన తరువాత దింపనక్కరలేదు. వేదమీ పతాకముల నెల్లవేళల మనవెంటనుండునట్లు చేసినది. మనకు తీరిక అయినపుడెల్ల భావవీధిక తెచ్చి వందన మాచరించుటకు వీలైన పతాక!

వేదము ఒక్క అక్షరమునందు విశ్వమంతటిని, దానికి కారణమైన బ్రహ్మమునుగూడ ఇమిడించినది. మన వాగ్యంత్రమును, దాని స్వరూపమును వివరించినది. మన ప్రధానస్వరూపమును తెలియపరచినది. ఇది వేదము అక్షర ములను, శబ్దములను కూర్చు విధానము. అటువంటి వేదమునందలి మన్త్రములయందు ఎంతటి మహార్థములుండునో గదా!

**ఓమిత్యే తదక్షరమ్, ఇదం సర్వం తస్యోపవ్యాఖ్యానం**

ఇది అథర్వ వేదోపనిషత్తయిన మాండూక్యమునందలి మొదటి వాక్యములు. అథర్వవేదము బ్రహ్మమునుగూరి చ చెప్పు వేదము. ఈ సృష్టియంతయు వివరించి, అందు బ్రహ్మము ఎట్లు వెలయుచున్నదో తెలియపరచు వేదము. ఓమిత్యేతదక్షరమ్ – ఏతదక్షరమనగా ఆ అక్షరము, అట్టి అక్షరము అని. ఉపనిషత్తు ఆరంభించుచునే, ఆ, అట్టిది, అనుచు న్నది. ఆరంభ మగుటవలన, ఎట్టిది? అనిన ప్రశ్న పుట్టును. మనమేది భావించిన, దాని స్వరూపమే ఓంకారమని ఆ వాక్యము యొక్క భావము. ఆ అర్థమును ౦౦డవ వాక్యము రూఢి చేయుచున్నది. ఇదం సర్వం– ఈ తస్యోప వ్యాఖ్యానం – ఆ ఓంకారమునకు వ్యాఖ్యానమే.

**ఓమిత్యే తదక్షరమ్, ఇదం సర్వం తస్యోపవ్యాఖ్యానం**

1. మాత్రకాలములో, ఒక అచ్చుతోడ ఎన్ని హల్లులను కలిపి పలుక గలుగుదుమో వేదము తెలియజెప్పినది. నాలుగు హల్లులవరకు మానవుని వాగ్యంత్రము పలుకగలదు. ఉదా : సంమార్ష్యను విత్యై(తైత్తిరీయ బ్రాహ్మణము, 3.3.9.69 ర్ష్య– ర్, ష్, ట్, య్ – అను నాలుగు హల్లులను అ అను అచ్చుతో కలిపి, ర్ష్య అను అక్షరమును పలుక గలుగుచున్నాము.

2. కొన్ని కొన్ని సంమిళితాక్షరములయందు, మాత్రకాలమును కొంచెముగా దాటును. అం– అటువంటిది. తరువాత అమ్ – ను పలుకుదుము కదా! అషరమెట్లు పుట్టునో, అచ్చులు, హల్లులు ఎట్లు కలియునో, ఉచ్చరించుటకు ఎంతకాలము పట్టునో, ఇది యంతయు వేదమన్త్రములయందు విశదముగా నున్నది.

3. **జాగరిత స్థానో వైశ్వానరోకారః ప్రథమామాత్రా** – జాగ్రదావస్థలో నున్న వైశ్వానరమే ఓంకారములోని ప్రథమమాత్ర అయిన అకారముచ్చరించునది. **స్వప్నస్థానస్తేజస ఉకారో ద్వితీయ మాత్రా** – స్వప్నమందలి తేజసమై ద్వితీయ మాత్రయై ఉకారముచ్చరించునది. **సుషుప్తస్థానః ప్రాజ్ఞోమకార స్తృతీయ మాత్రా** – నిద్ర యందలి ప్రాజ్ఞమే తృతీయ మాత్రయైన మకారముచ్చరించును (మాండూక్యోపనిషత్తు 11, 12, 13).

4. హృదయమనగా, మనము భావించు గుండె కాదు. హృదయమనిన శబ్దము. అన్ని వేదములందును తరచుగా కనబడును. హృదయశబ్దము చాల విశాలమై, గంభీరమైన అర్థము కలిగినది. సూక్ష్మముగ జెప్పినచో, మనము సేకరించు జ్ఞానము గూడు కట్టిన చోటు. మన ఆనందము, సంతోషము, తృప్తి ఉండుచోటు. బ్రహ్మలక్షణములు మనయందుండు చోటు.

తైత్తిరీయ బ్రాహ్మణమునందు మూడవకాండ, పదియవ ప్రశ్నలో సావిత్రి చయనమను క్రతువునకు సంబంధించిన మంత్రములున్నవి. అందు ఎనిమిదవ అనువాకములో హృదయ వివరణమున్నది.

**వాగ్ఘృదమే హృదయమ్మయి. అహమమృతే అమృతమ్బ్రహ్మణి**
**ప్రాణో హృదయే హృదయమ్మయి అహమమృతే అమృతమ్బ్రణి**

వాక్కు, ప్రాణము హృదయమందున్నవి. హృదయము పరుగెత్త గలదు. నేనమృతుడను. బ్రహ్మమమృతము. నేను బ్రహ్మమువంకకు పోవుచున్నాను, పోదును. అని తాత్పర్యము. (తైత్తిరీయ బ్రాహ్మణము, 3–10–8).